క్లుప్తంగా

ఘనంగా బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని అంకెనపల్లి గ్రామంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులు ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరాలో సంగారెడ్డికి చెందిన ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ షుగర్, కంటి పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, నాయకులు మురళీధర్‌రావు, చేరాల భాస్కర్, దేవేందర్‌గౌడ్, నందు, వైద్యులు సాయికృష్ణ, వెంకటేశ్, సబిత, ప్రత్యూష, శుభాష్ పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను ఎమ్మెల్యే సంజీవరెడ్డి గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. హక్కుల పరిరక్షణ, ఆడపిల్లల చదువుల అంశంలో తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

జహీరాబాద్ టౌన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్(సీఐటీయూ) క్లస్టర్ అధ్యక్షురాలు శశిరేఖ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలతో పాటు ఇతర బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శశికళ, నందమ్మ, శ్యామల, లక్ష్మిలు పాల్గొన్నారు.

ఎండోమెంట్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



000

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని ఎండోమెంట్ కార్యాలయం ముందు చేగుంట మండలం చిట్టోజి పల్లి గ్రామ రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ 200 రైతులు భూములు సాగు చేసుకుంటున్నారని ప్రభుత్వం నుంచి భూదాన యజ్ఞ బోర్డు నుంచి పట్టాలు వచ్చినా రికార్డు ధరణి ఆన్లైన్ లో పొందుపరచకుండా మోసం చేశారన్నారు. ప్రభుత్వం దేవాదాయ శాఖ స్పందించి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి భూములు రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు యేసు మల్లయ్య రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నియామకం

నారాయణఖేడ్: భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన సాయిరాంను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



జహీరాబాద్: మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్



పటాన్‌చెరు టౌన్: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రుణమాఫీ నెరవేరిన వేళ

ప్రభుత్వం రైతులకు మొదటి విడతగా రుణాలు మాఫీ చేయడంతో జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు గురువారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు, రైతులు మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ చేయడం చరిత్రాత్మకమని హర్షం వ్యక్తం చేశారు.



ఝరాసంగం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కంగ్టి: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు



న్యాల్‌కల్: ముంగి రైతు వేదికలో...



హత్నూర: దౌల్తాబాద్ రైతు వేదికలో...



మునిపల్లిలో...



జిన్నారం: సోలక్‌పల్లి గ్రామంలో...



రాయికోడ్‌లో...

ఆశావర్కర్లకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

పటాన్‌చెరు: వైద్యం, ఆరోగ్యం అంశాల్లో కీలక భూమిక పోషిస్తున్న ఆశావర్కర్లకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న సీపీఐ నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శివాలయం రోడ్డులో వారంతపు సంత ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు అవతలి వైపు ఉన్న శాంతినగర్, బాగారెడ్డిపల్లి, గాంధీనగర్, రాంనగర్, హమాలి కాలనీ, ఐడీఎస్ఎంటీ కాలనీ, సంతోష్‌నగర్ తదితర కాలనీ ప్రజలకు కూరగాయల సంత అందుబాటులో లేదన్నారు. పేదలు నివసించే బస్తీ ప్రాంతంలో వారంతపు సంత లేనందునా కూరగాయల కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రతి ఆదివారం శివాలయం రోడ్డులో వారంతపు సంత నిర్వహించే విధంగా చూడాలని కోరారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

జిన్నారం: మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న వివిన్ డ్రగ్స్ పరిశ్రమలో పని చేసిన 300 మంది కార్మికులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 నెలలుగా వేతనాలు చెల్లించలేకపోవడమే కాకుండా పరిశ్రమ యాజమాన్యం తమకు సమాచారం ఇవ్వకుండా విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తమకు వేతనాలు ఇవ్వనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు వేతనాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు కార్మికులకు సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను యూనియన్ నాయకులు విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ, హెల్పర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. టీచర్లకు రూ. 2లక్షలు, హెల్పర్లకు లక్ష పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరహార దీక్షలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవా ఊరేగింపు



సీఐ రవిని సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ఆషాఢ ద్వాదశి పురస్కరించుకుని పట్టణంలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో గురువారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకీసేవా ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద గోపాలకాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ టౌన్ సీఐ రవి, సబ్ రిజిష్ట్రర్ రాజేష్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెజుగం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి నామ రవికిరణ్ గుప్తా, ఉపాధ్యక్షుడు బాలచందర్, సభ్యులు కృష్ణ, నర్సింలు, కల్పన తదితరులు పాల్గొన్నారు. భజన మండలి సభ్యులు నిర్వహించిన భజనలు ఆకట్టుకున్నాయి.

సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

నారాయణఖేడ్: తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా చూడాలని కోరుతూ ఖేడ్‌లోని ఎంపీ సురేష్‌షెట్కార్ కార్యాలయంలో ఆశాకార్యకర్తలు ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలన్నారు ప్రతినెల 2వ తేదీన వేతనాలు అందజేయాలన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. రూ.50 లక్షల ప్రమాదబీమా, మృతి చెందినవారి అంత్యక్రియలకు రూ.50 వేలు, పదవీ విరమణ ప్రయోజనం కింద రూ.5లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందించినవారిలో నాయకులు సతీష్ ఉన్నారు. వినతిపత్రాన్ని ఎంపీకి అందజేస్తామని నగేష్‌షెట్కార్ హామీనిచ్చారు.

ఎమ్మెల్యే సాక్షిగా వివాదం

- మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌కు ప్రాధాన్యత ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం



వాగ్వాదానికి దిగిన ఇరువర్గాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ఏళ్ల కాలం నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న తమకు ఇప్పుడే పార్టీలో చేరిన నేతలు తగిన ప్రాధాన్యతను ఇవ్వకపోవటంపై జిన్నారం మండల కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలోని రైతువేదికలో గురువారం రైతు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు నీలం మధు, గాలి అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్‌ను వినేందుకు వేదికపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నీలం మధు, గాలి అనిల్‌కుమార్, కార్పొరేటర్ పుష్పతో పాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ కూడా వేదికపై కూర్చున్నారు. దీంతో స్పందించిన మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ మాట్లాడుతూ ఇరవై ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ పార్టీకి సేవలందిస్తున్న తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోగా ఇప్పుడే పార్టీలో చేరిన ప్రభాకర్‌ను వేదికపై ఎలా కూర్చొనిస్తారని, వెంటనే కిందకు దింపాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే వెంటనే కల్పించుకొని ఇరువురిని శాంతింపజేశారు.

ఘనంగా పాండురంగా రుక్మిణిదేవి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాంతీర్థ్ గ్రామంలో పాండురంగా–రుక్మిణిదేవి ఆలయంలో ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని కోరుతూ ప్రతి ఏటా ఆషాఢ మాసంలో ఆలయంలో స్వామివారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో పాండురంగా–రుక్మిణీదేవికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవాతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



మాచ్నూర్ గ్రామంలో నిలిచిన మురుగునీరు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వానాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కిందిస్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఇంటి ముందు మురుగు నీరు నిండిపోయింది. నెలలు గడుస్తున్నా మురుగునీరును తొలగించడం లేదని కాలనీవాసులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా మండల కేంద్రానికి నిత్యం వివిధ అభివృద్ధి శాఖల అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులను చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కుక్కల బెడద నివారించాలని వినతి

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను నివారించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కమిటీ సభ్యుడు మహిపాల్ మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల బెడద రోజు రోజుకు అధికమవుతోందన్నారు. గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. కమిషనర్ వెంటనే స్పందిస్తూ వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

◆ ఎన్నికల హామీలు అమలు చేయాలి

సంగారెడ్డి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం.. వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఈ నెల 20న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే నిరుద్యోగ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, యువ మోర్చా జిల్లా ప్రభారి రాజశేఖర్, పార్లమెంట్ కో–కన్వీనర్ ఆదిత్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సందీప్‌గౌడ్, సాయితేజ, ఉపాధ్యక్షులు ప్రశాంత్, అరవింద్ పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం (పటాన్ చెరు): డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. నూతనంగా ఎన్నికైన కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆమెను మర్యాదపూర్వక కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు అమృత్ సాగర్, సభ్యులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని నల్లంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బీడీఎల్ విన్నర్స్ ఫౌండేషన్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బగిలి జగదీశ్వర్ విద్యార్థులకు బ్యాగులతో పాటు క్రీడా సామగ్రి, నోట్ బుక్కులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మదన్‌గోపాల్, దుర్గారాణి, కృష్ణ, గ్రామస్తులు శ్రీనివాస్, అంజిరెడ్డి, రాములు, మాణ్యయ్య, సిద్దన్న, గోపాల్, వినయ్, రవిందర్, రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

◆ ముదిరాజుల సంక్షేమానికి కృషి

పటాన్‌చెరు: ప్రభుత్వం ముదిరాజుల సంక్షేమానికి కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర ముదిరాజ్ కోపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.